థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ మృతి

- కోర్టుకు ఛార్జిషీటు సమర్పించిన సిట్

ప్రజాశక్తి - ఎన్‌టిఆర్ జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన గాది సాయికృష్ణ మిస్సింగ్, లాకప్ డెత్ కేసులో సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ విజయవాడ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. సిట్ విచారణాధికారి (ఐజి) సుధాకర్ బాబు స్వయంగా కోర్టుకు హాజరై, కేసు దర్యాప్తు వివరాలు, కీలక సాక్ష్యాధారాలను న్యాయస్థానానికి సమర్పించారు. విజయవాడ కృష్ణలంక పోలీసుల కస్టడీలో ప్రయోగించిన థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ ప్రాణాలు కోల్పోయాడని ఛార్జిషీటులో సిట్ పేర్కొంది. సాయికృష్ణ అదృశ్యంపై అతని తల్లి విజయలక్ష్మి మొదటి నుంచి కృష్ణలంక పోలీసులపై తీవ్ర ఆరోపణలు చేస్తూ వచ్చారు. సాయికృష్ణ చనిపోయిన తర్వాత ఆధారాలు దొరకకుండా శవాన్ని స్వర్గపురి శ్మశాన వాటికలో అర్ధరాత్రి వేళ దహనం చేసినట్లు సిట్ తేల్చింది. ఈ ఘాతుకానికి పాల్పడిన కృష్ణలంక సిఐ నాగరాజుతోపాటు మొత్తం ఏడుగురిని నిందితులుగా చేర్చి ఇప్పటికే అరెస్ట్ చేసింది. పరారీలో ఉండి ఇటీవల లొంగిపోయిన గులివిందల సురేష్ ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. నిందితుల మొబైల్ లొకేషన్లు, కాల్ డేటా రికార్డులు, డిజిటల్ ఆధారాలు, సంఘటనా స్థలం నుంచి సేకరించిన శాస్త్రీయ ఆధారాలు, ఫోరెన్సిక్ నివేదికలు, కేసుతో సంబంధం ఉన్న కీలక సాక్షుల నుంచి సేకరించిన వాంగ్మూలాలు కోర్టుకు సుధాకర్‌బాబు సమర్పించారు. కేసులో నిందితులుగా కృష్ణలంక సస్పెండెడ్ సిఐ ఎస్‌ఎస్‌వివి.నాగరాజు , హెడ్ కానిస్టేబుళ్లు అశోక్ కుమార్, జంగం నాని, సిఐ అనుచరుడు గులివిందల సురేష్ , కానిస్టేబుళ్లు సాంబయ్య , బాబు రావు, ఆర్‌ఎంపి వైద్యుడు సుబ్బారావు ఉన్నారు.

తమ్మిలేరు కాలువలో స్నానానికి వెళ్లి ఒకరు మృతి

- మరొకరు గల్లంతు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తమ్మిలేరు కాలువలో సోమవారం స్నానానికి వెళ్లిన ఇద్దరు యువకుల్లో ఒకరు మృతి చెందారు. మరొకరు గల్లంతయ్యారు. స్థానికుల కథనం ప్రకారం... ఏలూరు నగర శివారు ఆర్‌టిఒ కార్యాలయ మార్గంలోని తమ్మిలేరు కాలువలో సోమవారం ముగ్గురు స్నేహితులు కలిసి స్నానం చేసేందుకు దిగారు. ప్రమాదవశాత్తూ ఇద్దరు నీటిలో మునిగిపోయారు. మరొకరు సురక్షితంగా ఒడ్డుకు వచ్చారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే ఇద్దరిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. కొన ఊపిరితో ఉన్న శనివారపుపేట ప్రభుత్వ కాలనీకి చెందిన కనకం పవన్ (17)ను బయటకు తీసి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. కాలువలో గల్లంతైన మరో యువకుడు షేక్ ఖలీఫ్ రోషన్ ఆచూకీ కోసం పోలీసులు, స్థానికులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

తౌషిక్ - మౌలాబి మృతికి 'కూటమి'దే బాధ్యత

- కేసును సిబిఐతో సమగ్ర విచారణ జరపాలి
- ఒంగోలు కలెక్టరేట్ వద్ద మహా ధర్నా

ప్రజాశక్తి – ఒంగోలు సిటీ

మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

తౌషిక్ - మౌలాబి మృతికి టిడిపి కూటమి ప్రభుత్వానిదే బాధ్యత అని, కేసును సిబిఐతో సమగ్ర విచారణ జరిపి, శ్రీచైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద ముస్లిం మైనారిటీ, దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తౌషిక్ - మౌలాబీ ఘటనలపై మహా ధర్నా నిర్వహించారు. విసికె పార్టీ జిల్లా అధ్యక్షులు మిడసల ఆదినారాయణ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తౌషిక్, అతని తల్లి మౌలాబీ మృతికి దారితీసిన పరిస్థితులను పూర్తిగా విచారించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం పోరాడుతూ తౌషిక్ తల్లి మృతి చెందినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. తౌషిక్ ఘటనపై విద్యాశాఖ చేపట్టిన విచారణ, పాఠశాలపై తీసుకున్న చర్యలు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. శ్రీచైతన్య యాజమాన్యంపై వచ్చిన ఆరోపణలను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని పలు ప్రజాసంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. మిడసల ఆదినారాయణ మాట్లాడుతూ శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యంపై గతంలోనూ పలు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. 2008లో సింగరాయకొండ మండలం అవులవారిపాలెంకు చెందిన మాధవి అనే ఎనిమిదో తరగతి విద్యార్థిని మృతి చెందిన ఘటనను ప్రస్తావించారు. ఇలాంటి నేపథ్యం తెలిసినప్పటికీ స్థానిక పోలీసులు, అధికారులు పాఠశాల యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నరేంద్ర మాదిగ మాట్లాడుతూ తౌషిక్ మౌలాబీ మృతికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని, ఈ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుస్తామని తెలిపారు. కేసును ఎపిసిసి, డిఐజి డిజిపి స్థాయి అధికారులతో కాకుండా సిబిఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆర్.మోహన్ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం చర్చి సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు.

వెలిగొండ నిర్వాసితుల నిర్బంధంపై సిపిఎం ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పెండింగులో ఉన్న వెలిగొండ నిర్వాసితులకు న్యాయం చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నిర్వాసితులపైనా, వారికి మద్దతు ఇచ్చిన సిపిఎం నాయకత్వంపైనా నిర్బంధం ప్రయోగించడాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిపిఎం మార్కాపురం జిల్లా కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య ఫోన్ లాక్కొని దౌర్జన్యంగా అరెస్టు చేయడం అమానుషమని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన రైతులు, కూలీలు, వృత్తిదారులను రోడ్డున పడేసి దాన్నే ఘనకార్యంగా చెప్పుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రయోజనం నిర్వాసితులకు సైతం దక్కాలని, అప్పుడే ఇలాంటి ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయి అభివృద్ధికి దోహదపడతాయని వివరించారు. వెలిగొండ నిర్వాసితుల మిస్సింగ్ జాబితా ప్రకటించాలని, పరిహారం అందని నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వాలని, పునరావాస కాలనీలలో సౌకర్యాలు కల్పించాలని, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు వాగ్దానం చేసిన రూ.2 లక్షలు వెంటనే ఇవ్వాలని, తదితర సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యాన శాంతియుతంగా మార్కాపురం జిల్లా కలెక్టరేట్ వద్ద వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారని వివరించారు. ఈ సందర్భంగా నాయకత్వాన్ని పోలీసులు అకారణంగా అరెస్టు చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. ఆందోళన చేస్తున్న వారిని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాల్సింది పోయి నిర్బంధం ప్రయోగించడం ద్వారా అణచివేయాలని చూడడం దుర్మార్గమని తెలిపారు. నిర్వాసితుల సమస్యలపై ఎలాంటి ఉద్యమం లేకుండా చేయాలన్న స్థానిక ప్రజా ప్రతినిధి ఒత్తిడి కారణంగా నిర్వాసితులపై పోలీసులు దాడికి పాల్పడ్డారని, సోమయ్యను అరెస్టు చేయడమేగాకుండా గాయాలైనా వైద్యం చేయించలేదని వివరించారు. దాడికి పాల్పడిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, జిల్లా కార్యదర్శి సోమయ్యకు వెంటనే చికిత్స అందించాలని, ఇప్పటికైనా ప్రభుత్వం నిర్వాసితుల పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులపై దాడి బాధాకరం

- కఠిన చర్యలు తీసుకుంటాం : మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం బాధాకరమని, క్రిమినల్ గ్యాంగులను వదిలే ప్రసక్తి లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హెచ్చరించారు. గురువులను వైన్ షాపులకు కాపలా పెట్టిన జగన్.. ఉపాధ్యాయులను గౌరవిస్తారనుకోవడం భ్రమ అని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తప్పుడు నిందలతో అవమానాలు పాలైన స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు తమకు న్యాయం చేయాలంటూ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని తెలిపారు. శాప్ కార్యాలయం వద్ద అల్లర్లకు పాల్పడిన వారిని ఎవరినీ వదిలిపెట్టబోమని హోంమంత్రి వంగలపూడి అనిత మరో ప్రకటనలో హెచ్చరించారు. శాప్ కార్యాలయం వద్దకు వచ్చినవారి వీడియోలన్నీ పరిశీలించామని, రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో నిందితులు, అనుమానితులు ఉన్నారని తెలిపారు. లిక్కర్ స్కామ్‌ను పక్కదారి పట్టించేందుకే డిఎస్‌సిపై వైసిపి రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. అబద్ధాలు, అసత్యాలతో జగన్ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మంత్రి కొలుసు పార్థసారథి మరో ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణం బయటపడుతుండటంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు డిఎస్‌సి అభ్యర్థులపై, నియామకాలపై బురదజల్లుతున్నారని టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో స్వర్ణాంధ్ర కార్పొరేషన్ వైర్మన్ పట్టాభిరామ్ ఆరోపించారు.

ప్రశ్నిస్తే 'యువగళం' గూండాలతో దాడులు : సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిఎస్‌సి స్పోర్ట్స్ కోటా పేరిట అర్హులను ముంచి, పోస్టులను బరితెగించి అమ్ముకున్న కూటమి ప్రభుత్వం అక్రమాలను ప్రశ్నిస్తే 'యువగళం' గూండాలతో దాడులు చేయించడం అత్యంత హేయమైన చర్య అని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద శాంతియుతంగా వినతిపత్రం ఇచ్చేందుకు ముందే సమాచారం ఇచ్చినా నిరాకరించిన పోలీసులు, మరోవైపు శాప్ కాంపౌండ్‌లోనే స్పోర్ట్స్ కోటా టీచర్లకు టెంట్లు, మైకులు వేసి రక్షణ కల్పించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. పోలీసుల సమక్షంలోనే టిడిపి గూండాలను రప్పించి తమ పార్టీ శ్రేణులపై దౌర్జన్యాలకు పాల్పడటం ముమ్మాటికీ ప్రభుత్వ ప్రాయోజిత దాడేనని, ఈ దారుణాలపై కూటమి సర్కారు ప్రజలకు సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 3.5 లక్షల మంది నిరుద్యోగ యువత భవిష్యత్‌ను కాలరాస్తున్న విధానాలపై మేధావులు, ప్రజా సంఘాలు, బాధితులు ఏకమై గళమెత్తాలని కోరారు.

పోలీసుల లాఠీచార్జ్‌పై సిపిఐ ఖండన

వైసిపి నాయకులపై పోలీసుల లాఠీచార్జ్‌ను ఖండిస్తున్నట్లు సిపిఐ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిఎస్‌సి స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని వైసిపి నాయకులు చేసిన నిరసన ర్యాలీపై ప్రత్యక్షంగా భౌతికదాడులు చేయించడం, లాఠీచార్జ్ వంటి చర్యలకు పాల్పడం తగదన్నారు. శాంతియుత ఉద్యమాలపై దాడులకు తెగబడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఈసారైనా ఎన్నికలు జరిగేనా?

- 2019 నుంచి 4 కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారుల పాలన
- గ్రామాల విలీనంపై కోర్టుల్లో కొనసాగుతున్న కేసులు
- టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు దాటినా లభించని పరిష్కారం
- మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారుల సమన్వయలోపం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు ఒకవైపు సన్నాహాలు జరుగుతుండగా మరోవైపు గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉండిన నాలుగు కార్పొరేషన్‌లు, 19 మున్సిపాలిటీలకు ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం కన్పించడం లేదు. పరిసర గ్రామాలను మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల్లో విలీనం చేస్తూ గత ప్రభుత్వం 2020లో తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అప్పట్లో ఆయా గ్రామాలకు చెందిన కొందరు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు హైకోర్టులో కేసులు దాఖలు చేశారు. దీంతో, ఎన్నికలు నిర్వహించకుండా, గ్రామాల విలీనంను నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

2021 మార్చి పదిన రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగినా శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్లకు జరగలేదు. మున్సిపాలిటీలకు సంబంధించి రాజాం, ఆముదాలవలస, తణుకు, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, చింతలపూడి, తాడిగడప, గుడివాడ, బాపట్ల, నరసరావుపేట, పొన్నూరు, కందుకూరు, పొదిలి, కావలి, ఆలూరు, గూడూరు, వి కొత్తకోట, శ్రీకాళహస్తిలోనూ ఎన్నికలు నిర్వహించలేదు. 2021లో ఎన్నికలు జరిగిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఐదేళ్ల కాలపరిమితి పూర్తయి ఈ ఏడాది మార్చి 18 నుంచి ప్రత్యేక అధికారుల పాలన అమలులోకి వచ్చింది. మళ్లీ మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం అవుతున్న ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న నాలుగు కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలపై ఏ మాత్రమూ దృష్టి సారించడంలేదని పలువురు టిడిపి ఎమ్మెల్యేలూ ఆక్షేపిస్తున్నారు. వీటిపై అప్పట్లో వైసిపి జారీ చేసిన జిఒలకు మున్సిపల్ పరిపాలన శాఖ చట్టసవరణ చేయాల్సి ఉందని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా గత రెండేళ్లలో స్పందన లేదని టిడిపి ఎమ్మెల్యే ఒకరు 'ప్రజాశక్తి' వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి పంచాయతీరాజ్, మున్సిపల్ పరిపాలన శాఖల మధ్య సమన్వయం కొరవడిందని కూడా చెబుతున్నారు. మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి కోర్టులో కేసులు తొలగినా ఎన్నికలు జరగడంలేదని ఆ ప్రాంత టిడిపి నాయకులు అసంతృప్తిగా ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కోర్టు వివాదాల వల్ల పొన్నూరు, బాపట్ల, నరసరావుపేట మున్సిపాలిటీలలో 2021లో గ్రామాలు విలీనం ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. 2014 తరువాత ఉమ్మడి గుంటూరు జిల్లా మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీ, బాపట్ల, పొన్నూరు, నరసరావుపేటలో ఎన్నికలు జరగకపోవడంతో 2019 నుంచీ ఈ పట్టణాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. నర్సరావుపేట పట్టణ పరిధిలో గ్రామాల విలీనంపై ఉన్న కేసులను టిడిపి వారు ఉపసంహరించుకోగా వైసిపి వారు ఇంకా ఉపసంహరించుకోకపోవడం వల్ల కోర్టులో వివాదం నేటికీ నడుస్తోంది. విలీన గ్రామాల వివాదం కారణంగా ఎన్నికలు వాయిదా పడుతున్నాయి. కోర్టు కేసుల కారణంగా 23 మున్సిపాలిటీలకు నిధులు రావడం లేదు. పట్టణాల్లో గ్రామాల విలీనానికి దాదాపు 110 పంచాయతీల్లో 2021లో ఎన్నికలు జరగలేదు. 2018 నుంచి ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కోర్టు వివాదాల వల్ల ఆగిపోయిన కార్పొరేషన్, మున్సిపల్, పంచాయతీల్లోనూ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ

'కద్దిరి కాళిదాస్'గా...

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కాకా'. ఈ సినిమాలో చిరంజీవి పోషిస్తున్న పాత్ర పేరు 'కదిరి కాళిదాస్' అని చిత్ర బృందం వెల్లడించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, ఫస్ట్ లుక్‌లో చిరంజీవిని విభిన్నమైన మాస్ లుక్‌లో చూపించారు. ఆయన పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలను చిత్ర బృందం దశలవారీగా వెల్లడిస్తోంది. చిరంజీవి ఇమేజ్‌కు అనుగుణంగా యాక్షన్, కుటుంబ భావోద్వేగాలు, వినోదానికి ప్రాధాన్యమిస్తూ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. 'కదిరి కాళిదాస్' పాత్ర స్వభావం, కథలో దాని ప్రాధాన్యం ఏమిటనేది ప్రస్తుతానికి గోప్యంగా ఉంచారు. ఈ సినిమాను సంక్రాంతి 2027 సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

గోండు యోధురాలిగా రష్మిక

రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'మైసా' టీజర్ విడుదలైంది. నూతన దర్శకుడు రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక గోండు గిరిజన మహిళగా కనిపించనున్నారు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ సినిమా నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. 'నేను అలసిపోయాను.. ఆగిపోయాను.. ఓడిపోయాను' అంటూ రష్మిక పాత్ర చెప్పే మాటలతో టీజర్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత పరిస్థితులకు ఎదురొడ్డి నిలిచే మహిళగా ఆమె పాత్రను ఆవిష్కరించారు. యాక్షన్ సన్నివేశాలతో పాటు నీటి అడుగున చిత్రీకరించిన సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. పాత్ర కోసం రష్మిక చేసిన శారీరక మార్పు కూడా టీజర్‌లో స్పష్టంగా కనిపించింది. గిరిజన జీవన నేపథ్యంతో సాగే ఈ కథలో భావోద్వేగాలకు, యాక్షన్‌కు ప్రాధాన్యమిచ్చినట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది.

ఉపాధ్యాయుడిపై హత్యాయత్నం

- పరిస్థితి విషమం

ప్రజాశక్తి -కాళ్ల

ఓ ఉపాధ్యాయుడిపై దుండగులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. విచక్షణారహితంగా దాడి చేయడంతో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం మేరకు... పెదఅమిరం గ్రామానికి చెందిన చోడాబత్తుల వెంకట రత్నం అనే వ్యక్తి ఉండి మండలం పరిధిలోని ఎన్‌ఆర్‌పి అగ్రహారంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల అనంతరం... వాకింగ్ చేయడానికి తన ఇంటినుంచి బయటికి వెళ్లారు. వాకింగ్ చేస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై రాడ్‌తో విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే భీమవరం ఆసుపత్రికి ఉపాధ్యాయుడిని తీసుకువెళ్లారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వెంకటరత్నం ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీహార్‌లో ఘోరం

- నడి రోడ్డులో బాలికపై వేధింపులు
- డబుల్ ఇంజన్ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

పాట్నా : బిజెపి డబుల్ ఇంజన్ ప్రభుత్వ పాలనలోని బీహార్‌లో మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. తాజాగా ఒక మైనర్ బాలిక, ఆమె స్నేహితుడిపై కొంతమంది దుండగులు దారుణంగా వేధింపులకు పాల్పడిన వీడియో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత శనివారం సాయంత్రం జముయి పోలీస్ స్టేషన్ పరిధిలోని జముయి - లఖీసరాయ్ రోడ్డుపై ఈ ఘటన జరిగింది. ఈ వీడియోలో ఒక బాలిక ఆమె స్నేహితుడిని కొందరు వ్యక్తులు వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం స్పష్టంగా కనిపించింది. ఈ ఘటనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామని, వీడియోలో కనిపించిన తొమ్మిది మందిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ''పోలీసులు బాధితురాలు, ఆమె స్నేహితుడిని సంప్రదించారు. కోచింగ్ క్లాస్ ముగించుకుని తిరిగి వస్తుండగా, జముయి-లఖీసరాయ్ రోడ్డుపై ముసుగులు ధరించిన కొంత మంది వ్యక్తుల బృందం వారిని అడ్డుకుని వేధించింది'' అని జముయి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్‌పి) విశ్వజిత్ దయాల్ తెలిపారు. ''ఈ ఘటనపై ఈ నెల 20న ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. వైరల్ వీడియోలో కనిపించిన వారిలో కొందరిని ఇంకా అరెస్టు చేయలేదు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న వారందరినీ త్వరలో అరెస్టు చేస్తాం' అని దయాల్ తెలిపారు. ఈ ఘటనను బీహార్ రాష్ట్ర మహిళా కమిషన్ కూడా సుమోటోగా స్వీకరించింది. విచారణ ప్రారంభించింది. దీనిలో ప్రమేయం ఉన్న వారందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి దుస్థితిని ఎదుర్కొంటున్న మహిళలందరికీ అండగా నిలుస్తామని కమిషన్ చైర్‌పర్సన్ అప్సర తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా కుప్పకూలిందని ఆర్‌జెడి అధికార ప్రతినిధి శక్తి సింగ్ యాదవ్ విమర్శించారు. పోలీసులు ఈ ఘటనపై త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
HINDUJA HOUSING FINANCE LIMITED
అనుబంధం- IV-A
శ్రీ రఘు జి ఎన్ [జీ ఆర్ఎం] మొబైల్ నెం : 9886273806, శ్రీ ఎం. రాము కృష్ణ మూర్తి (ఆర్ఓఎం), మొబైల్ నెం. 9515154512.
ఇ-వేలం కమ్ అమ్మకం కొరకు ప్రజా ప్రకటన (అనుబంధం - IV-A) (నియమం 8(6))
www.bankeauctions.com
LanNo:AP/CTR/CHTR/A000000141
LanNo:AP/CDP/CUDP/A000000293